# వీధి దీపాలు

తూర్పు దిక్కున అరుణరాగం అద్దుకుంటోంది. పక్షులు మేల్కొని మధురనాదాలు చేస్తున్నాయి. అరవిరిసిన పుష్పాలు సుగంధాలు గుప్పుతుంటే చల్లగాలి రెపరెపలాడుతోంది. అప్పుడే అక్కడక్కడ జనం మేల్కొంటున్నారు. వెంకటేశ్వరస్వామి దేవాలయంనుంచి "వెంకటేశ్వర తవ సుప్రభాతం" అంటు మధురంగా సుప్రభాతం వినబడుతోంది. భక్తుల మనస్సులు పరవశంతో ఊగుతున్నాయి. వీధి మధ్యలో ఉన్న మశీదులో "అల్లాహో అక్బర్" అంటూ నాదాలు చేస్తున్నారు.

ధర్మారావుగారు సుప్రభాతం కాగానే వెంకటేశ్వరునికి మరోసారి నమస్కరించి విడువలేక విడువలేక గుడినిదాటి బయటకువచ్చారు. అయినా అతని మనస్సంతా భగవంతునిలోనే లీనమయింది. విశాలమైన అతని నుదుటిమీద అడ్డంగా గంధపుచారలు మధ్యలో కుంకుమ అతని ముఖానికి మరింత గాంభీర్యాన్ని కలిగిస్తున్నాయి. ఎర్రని పెద్దాపురం

పట్టుపంచెలు పచ్చని శరీరానికి నిండుతనాన్ని అందిస్తున్నాయి. నిత్యం సుప్రభాతవేళలో ఆయన ఆ దేవాలయంలో ఉంటారు. అతని భక్తి శ్రద్ధలు అటువంటివి. దొడ్లో పూసిన గన్నేరు, నందివర్ధనాలు దేవునికి నిత్యం సమర్పిస్తారు.

ఆయన రోడ్డుమీద సగం దూరంవచ్చి హఠాత్తుగా ఆగారు. మశీదులోనుండి అక్బర్‌ఖాన్ అప్పుడే బయటకువచ్చాడు. అతన్ని చూడగానే ధర్మారావుగారి ముఖంలో ప్రశాంతత మాయమై ముఖం ముడుచుకుపోయింది. ముఖం పక్కకు తిప్పుకున్నారు. అతన్ని చూసిన అక్బరుఖానే పక్కకు తప్పుకున్నాడు. ధర్మారావుగారు ఎటోచూస్తూ ఇంటిముఖం పట్టారు. దారిలో ఎదురువచ్చిన జోసఫ్‌ని ఆయన పట్టించుకోలేదు.

పెరటోకి వెళ్ళి కాళ్ళు కడుక్కుంటున్న సేపు ఆయన విసుక్కుంటూనే ఉన్నారు. ఈమధ్య ఆయన ధోరణి అర్థంకాని కామాక్షమ్మ ఆయనవైపు ఆశ్చర్యంగా చూసింది.

"ఎవర్నిరోజా తిట్టుకుంటున్నారు" ఉండబట్టలేక అడిగింది.

"ఎవర్నేమిటి? నన్ను నేనే తిట్టుకుంటున్నాను" అన్నాడు మరింత కోపంగా?

"అదే ఆ తిట్టుకోడం దేనికని?

"దేనికో నీకు చెప్పాలా? దొడ్లో వేసారుగా తిష్ట. అసలు అమ్మినవాణ్ని అనాలి. కట్టుకున్నవాళ్ళకేనా బుద్ధుండాలా?" అన్నాడు రుసరుసలాడుతూ.

అప్పటికి ఆవిడకు పూర్తిగా అర్థమయింది.

"అదేమిటండీ అలా అంటారు. అక్కడ వాళ్ళు ఇల్లు కట్టుకుంటుంటే మీకేమిటిబాధ? అయినా వాళ్ళుమననేం చేసారండీ!" అంది కాస్త

విసుగ్గా.

"ఇంకా ఏం చేయాలి? మనమతాన్ని భ్రష్టు చేసారు. మన పెరటికి ఎదురుగా వాళ్ళు ఇళ్ళు కట్టుకోడం ఏమిటి? స్నానంచేసి వస్తుంటే ఎదురుగా కనబడుతున్నారు. మడిదడి ఏమీలేదు. ఛీ! ఛీ! ఏం కొంపలో ఏమో?" అన్నాడు.

"అలా అనుకుంటే ఏమవుతుందండి. వాళ్ళు మనజోలికి వచ్చారా ఏమైనా? మన ఆచారం మనది. వాళ్ళ ఆచారం వాళ్ళది" అంది ఆయనకి కాస్త నచ్చచెప్పటానికి ప్రయత్నం చేస్తూ.

"ఇంకేం మడి? ఇంకేం ఆచారం. అంతా నాశనమయింది. తెల్లారితేచాలు పనికిరానిముఖాలు ప్రత్యక్షం" అన్నాడు గట్టిగా.

ఆ మాటలువిన్న అక్బర్ ఖాన్ "ఎవరివి పనికిరాని ముఖాలు హమారేహై, ఆప్‌కాహై" అన్నాడు గోడ అవతలనుంచి.

"మీవే ఎందుకు పనికిరాని ముఖాలు. మీవే ఖచ్చితంగా మీవే! ఖచ్చితంగా మీవే! అన్నాడు మరింత గట్టిగా.

అంతలో వెనకనుంచి అక్బర్ ఖాన్ కొడుకు కంకరరాళ్ళు విసిరాడు. అందులో ఒకరాయి వచ్చి ధర్మారావుగారి కూతురు గీత నుదుటికి తగిలింది. రక్తం బొటబొటా కారింది. అది చూసిన ధర్మారావుగారి కొడుకు తిరిగి రాళ్ళు విసిరాడు. ఒక రాయి అక్బర్ ఖాన్ కాలికి తగిలి రక్తం చిమ్మింది. వెంటనే రెచ్చిపోయిన అక్బరుఖాన్ పిల్లలు, పక్కవాళ్ళు జోసఫ్ కర్రలు పట్టుకొని గోడదాటి ఇవతలకి వచ్చారు. ఇటుపక్కవాళ్ళు, ఇరుగు పొరుగులు ధర్మారావు పక్షాన కర్రలు తీసారు.

"మేమంటే ఏమనుకుంటున్నారు" అంటూ ఇరు పక్షాలు కర్రలు ఎత్తారు. ఒకరిమీద ఒకరు కలియబడి కొట్టుకున్నారు.

ధర్మారావుగారి తలపగిలింది. ఆయన కొడుకు చెయ్యి విరిగింది.

అటువక్క జోసఫ్ నడ్డి విరిగింది. అక్బరీఖాన్ నుదురుచిట్లింది. ఎవరో వెళ్ళి పోలీసుల్ని పిలుచుకొచ్చారు.

పోలీసుల్ని చూడగానే సగం మంది కర్రలు అక్కడే వదిలి పారిపోయారు. దెబ్బలు తగిలిన వాళ్ళని హాస్పటల్‌కి తీసుకువెళ్ళి కట్లు కట్టించి స్టేషన్‌లో కూర్చోబెట్టారు. ధర్మారావుగారు, జోసఫ్, అక్బర్ ఖాన్ కొడుకులు అందరు తలోపక్కకి ముఖాలు తిప్పుకు కూర్చు న్నారు.

తర్వాత ఊళ్ళో పెద్దలువచ్చి బేలుమీద విడిపించి ఇంటికి తీసు కెళ్ళారు.

"ఎవరి మతం వాళ్ళకి గొప్ప. ఎవరి ఆచారాలు వారివి. ఇందులో ఎవరు ఎక్కువ. ఏది గొప్ప అంటే చెప్పలేం" అంటూ పెద్దలు అంద రికి హితబోధ చేసారు.

"ఏమిటి చెబుతున్నారండి మీరు? మన మతంతో సమానమైన మతముందా? మన దేముడే ఆదిదేవుడు. మన దేవుని బిడ్డలే వాళ్ళ యేసు గాని, వీళ్ళ మహమ్మదుగాని, అందుకే మన దేముడే అందరికంటె గొప్ప" అన్నారు ధర్మారావుగావు.

"ఇదేం మాటండి? మా దేముడే మొదటివాడు." ఆ ఇద్దరు ఒక్కసారె అరిచారు.

"ధర్మారావు ఊరుకోవయ్యా!" అంటు అతన్ని ముందుకు తీసు కెళ్ళాడు పూజారి.

"నువ్వుకూడా అలా అంటే ఎలా? ఆ అనాచారుల్ని పట్టుకుని వెనకేసుకొస్తున్నావు. మన మతం, మన ఋషీశ్వరులు ఎంత గొప్ప వారు. మన దేముడే ఆదిశంకరుడు" అంటూ ధర్మారావుగారు ఇల్లుచేరే వరకు పూజారితో వాదన చేస్తూనేవున్నారు. పోలీసుస్టేషనులో వారి

పక్కన కూర్చున్నానని తలకు స్నానం చేసాక ధర్మారావుగారు చల్లబడ్డారు.

"అమ్మా కామాక్షమ్మా! నువ్వయినా కాస్త సర్దుబాటు చేస్తుండవమ్మా! లేకపోతే ప్రాణాలకే నష్టం" అంటు శలవు తీసుకున్నాడు పూజారి.

"నా దేముణ్ని ఎవరైనా తక్కువచేస్తే ,ఈసారి ముక్కలుగా నరికేస్తానంటూ కత్తితీసి పక్కనే పెట్టుకున్నాడు అక్బర్‌ఖాన్. ఆ మాటలువిన్న కామాక్షమ్మ గుండెల్లో రైళ్ళు పరుగెత్తాయి.

ఆ సాయంకాలం జోసఫ్ తల్లి వంట చేస్తుంటే పొరపాటున మంటలు ఎక్కువై పాక అంటుకుని మంటలు లేచాయి. మగవాళ్ళ ఇళ్ళల్లో లేరు, జోసఫ్ ఇంటితోపాటు అక్బరుర్‌ఖాన్ యిల్లుకూడా అంటుకుంది. ఆడవాళ్ళు ఆర్తనాదాలు చేసారు. ధర్మారావుగారు ఆర్ప డానికి ప్రయత్నించలేదు. పైగా ఇంట్లో వాళ్ళని వెళ్ళనియ్యలేదు.

"మా దేముణ్ని తిట్టినందుకు మంచి బాగా అయిందని మా మతాన్ని తిట్టినందుకు శాపం తగిలిందని గట్టిగా అనడం మొదలు పెట్టారు.

అది విన్న కామాక్షమ్మ- తప్పండి అలా అనకండి. వాళ్ళకి అంతకష్టం వస్తే సహాయం చెయ్యలేదు సరికదా! అలా అనడానికి నోరు ఎలా వచ్చిందండి అన్ని శాస్త్రాలు చదివిన మీలో విజ్ఞానానికి బదులు అజ్ఞానం చోటుచేసుకుందండి గట్టిగా ఆ మాటలు అనకండి, ఆ మాటలు వింటే వాళ్ళు కత్తితో నరికి పోగులు పెడతారండి" అంది భయం భయంగా.

"ఏడిశారు" అంటూ అక్కడ నుంచి వెళ్ళారు ధర్మారావుగారు. ఆ మాటలు విన్న జోసఫ్, అక్బర్‌ఖాన్ కోపంతో ఊగిపోయాడు. తర్వాత ఊరిడిమంది వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేసారు. అయినా పూర్తిగా ఇద్దరి ఇళ్ళు సామానుతో సహితంగా కాలిపోయాయి. చాలా నష్టం వచ్చింది. ఇద్దరికి నిలవ నీడలేదు. ఊరిడిమంది చందాలు వేసి పునరావాసం కల్పించారు.

ధర్మారావుగారు మాత్రం తన దేవుని మహిమవల్లే తమ యిల్లు కాలలేదనే ధీమాతో ఉన్నారు. కాని మనస్సులో మాత్రం ముగ్గురిలో పొగలు రగులుతూనే ఉన్నాయి.

అంతలో దీపావళి పండగ రానేవచ్చింది. సాయంకాలం ఇళ్ళు, వాకిళ్ళు, వీధులు, అరుగులు, అన్నీ దీపాలతో నిండిపోయి కలకల్లాడు తున్నాయి. చిచ్చుబుడ్లు, మతాబులు, తారాజువ్వల రవ్వల, ధ్వను లతో ఆకాశం దద్దరిల్లుతోంది. అది సహించలేని అక్బర్‌ఖాన్ కొడుకు ఒక తారాజువ్వ వాళ్ళింటిమీదికి గిరవాటు పెట్టాడు.

దీపాలు పెడుతున్న కామాక్షమ్మగారి చీర అంటుకుంది. చూస్తున్నవాళ్ళంతా గావుకేకలు పెట్టారు. కాని ఆవిడచీర ఆర్పడానికి అందరూ సిద్ధపడేలోపల ఆమె ఒళ్ళు కాలిపోయింది. అప్పుడే అక్కడికి వచ్చిన ధర్మారావుగారు "కామాక్షీ! అంటూ గావుకేక పెట్టారు.

బాధతో మెలికలు తిరిగిన కామాక్షమ్మ నేలకూలింది. "అమ్మా!" అంటు పిల్లలు ఆమెను చుట్టుముట్టారు. ఇరుగుపొరుగులు వచ్చి ఆమెను హాస్పిటల్‌కి తరలించారు. ఎమర్జన్సీ వార్డులో పెట్టారు ఆమెను.

అది తెలిసిన జోసఫ్, చాలా బాధపడ్డాడు. "ఆ యిల్లాలు చాలా మంచిది. ఆమెను యేసు కాపాడాలి" అంటూ పరుగు పరుగున హాస్పి టల్‌కి వెళ్ళి ఆమెను చూసి కళ్ళు తుడుచుకున్నాడు.

అక్బర్‌ఖాను, భార్యాకూడా చాలా బాధపడ్డారు. "హాయ్! అల్లా అనుకుంటు వాళ్ళుకూడా హాస్పటల్‌కి పరుగెట్టారు. ఆమెను చూడగానే వారి దుఃఖానికి అంతులేదు. ధర్మారావుగారు దిగులుగా ఒకమూల కూర్చుని ఉన్నాడు.

ఆయన్ని చూడగానే అక్బర్‌ఖాన్ గుండెలు బరువెక్కాయి. దగ్గరకు వెళ్ళి క్షమించమంటే ఏమంటాడోనని భయపడ్డాడు.

"పిల్లలు ఆమె చుట్టూచేరి" అమ్మా! అయ్యా! అంటు బావురు మంటుంటె చూడలేక అందరు వారితోపాటు ఏడ్చారు.

డాక్టర్లు వచ్చి అందరిని బయటకు పంపించేసారు.

చర్చికి వెళ్ళి జోసఫ్ "యేసు ప్రభు! ఆ తల్లిని రక్షించండి" అంటూ ప్రార్థన చేసాడు.

అక్బర్‌ఖాన్ మశీదుకు వెళ్ళి కామాక్షమ్మను కాపాడమని ప్రార్థించాడు."

పూజారి ఆమె ఆరోగ్యంకోసం పూజలు చేసాడు. తల్లి బతకాలని పిల్లలు కొబ్బరికాయలు కొడతామని మొక్కుకున్నారు. ధర్మారావు గారు చెప్పనే అవసరం లేదు. 24 గంటలు దాటితే ప్రమాదంలేదన్న డాక్టర్లు మరో 6 గంటలు దాటాలన్నారు.

అలా ప్రార్థనలు చేస్తూనే ఉన్నారు.

కామాక్షమ్మ మెల్లిగా కదిలింది. నాలుక్కుంతా బాగా కాలిన ముఖం కాలలేదు. ఆమె ముఖం అంత బాధలోనూ ప్రసన్నంగానే ఉంది.

అక్బర్‌ఖాన్ "క్షమించమ్మా" అంటూ చేతులు జోడించాడు. జోసఫ్ "అమ్మా! యేసు రక్షించాడమ్మా" అన్నాడు.

"ఏ దేముడైనా ఒక్కటే. ఎవరి దేముడు వారికి గొప్ప. అందరి దేముళ్ళు కలిసి నన్ను రక్షించారు. మీరంతా కలసిమెలసి ఉండాలి.

నాకు అంతేకావాలి" అంది నీరసంగా. ఆమె మాట నూతిలో నుంచి వస్తున్నట్లు ఉంది.

"ఎక్కువ మాట్లాడించకండి" అంటు డాక్టర్లు హెచ్చరిక చేసారు. అంతలో అక్కడకు వచ్చిన పూజారి." ధర్మారావుగారూ! మీరంతా మామతం గొప్పదంటె మామతంగొప్పదని పంతాలుపట్టి అనర్థాలు తెచ్చుకున్నారు. ఇప్పుడు చూసారా ఏంజరిగిందో? ఏదేముడైనా ఒక్కడే! ఏ దేముడైనా
ఒక్కడే" అన్నారు.

"నిజం పూజారిగారు. ఎవరి నమ్మకం వాళిదని ఇప్పుడేతెలిసింది" అంటూ ధర్మారావుగారు, జోసస్, అక్బరుఖాన్ చేతులు కలిపారు.

"వీధిదీపాల్లా జనంవెలుగుతూ అజ్ఞానులకి వెలుగు చూపించాలి. అప్పుడే మానవజన్మ సార్థకమవుతుంది" అన్నాడు పూజారి.

"నువ్వు చెప్పింది నిజంపూజారి. వీధిదీపాలు చీకట్లో నడిచేవారికి వెలుగు చూపిస్తాయి. అజ్ఞానులకి విజ్ఞానం చూపించేవాడే మనిషి" అన్నారు ధర్మారావుగారు. ఆయన ముఖం కాంతివంతమయింది. మిగిలినవారి మనస్సులు తేలికపడ్డాయి. అప్పుడే వెలిగిన వీధిదీపాలవైపు చూసారు అందరు.

"బీద, ధనిక భేదంలేకుండా ఏ మతంవారని భేదం లేకుండా వీధిదీపాలు అందరికి వెలుగుపంచుతాయి. భగవంతుడుకూడా అంతే. అతనికి ఏ మనిషైనా ఒక్కడే" అన్నాడు పూజారి.

నిర్మలంగా అతనివైపు చూసారు అంతా.

కరణం శకుంతల కథల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన కథ

16-10-1990